SK1 one NEWS HD
www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com
ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 179 | పేజిలు : 04, వెల రూ. 2 రూ/ | శుక్రవారం 18-09-2026




## తెలంగాణలో పట్టభద్రుల
# ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల
- మహబూబ్‌నగర్, వరంగల్ నియోజకవర్గాలకు ఎన్నికల ప్రక్రియ
- సెప్టెంబర్ 20 నుంచి నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- పాత ఓటర్లు కూడా మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాలని స్పష్టం
- డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటన

**హైదరాబాద్ :** తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం- - మిగతా 2 లో

## చరిత్రకు మతం
## రంగు పులిమే ప్రయత్నం జరుగుతోంది



- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- సెప్టెంబర్ 17 సందర్భంగా జెండా ఆవిష్కరించిన కవిత
- కాంగ్రెస్, బీజేపీలపై కవిత విమర్శలు
- విలీన చరిత్రను వక్రీకరిస్తున్నాయని ఆరోపణ
- మతాలకు అతీతంగా ప్రజలు పోరాడారని వెల్లడి

**హైదరాబాద్ :** తెలంగాణ విలీన పోరాట యోధుల స్ఫూర్తితో రాష్ట్రంలో రాజ్యమేలుతున్న అరాచక శక్తులను గద్దె దించుతామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. సెప్టెంబర్ 17ను - మిగతా 2 లో

## తెలంగాణ గడ్డ స్వభావం
# అన్యాయాన్ని ఎదిరించడం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అంతకు ముందు గన్‌పార్కులో అమరవీరుల స్థూపం వద్ద నివాళు లర్పించిన రేవంత్ రెడ్డి
- సెప్టెంబరు 17ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోంది
- ఈ సందర్భంగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు
- సామాజిక న్యాయమే పునాదిగా పాలన అందిస్తున్నామన్న సీఎం
- రాష్ట్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు



**హైదరాబాద్ :** తరతరాల అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ అని అభివర్ణించారు. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ప్రజా చైతన్యాన్ని రగిలించిందని తెలిపారు. సెప్టెంబరు 17వ తేదీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. అంతకు ముందు గన్‌పార్కులో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. సమ్మక్క-సారలమ్మ పోరాటం నుంచి సాయుధ పోరాటం వరకు అన్యాయాన్ని ఎదిరించడం ఈ తెలంగాణ గడ్డ స్వభావమని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. సుదీర్ఘ పోరాట చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానం ఉందని, నిజాం పాలనలో హైదరాబాద్ ప్రపంచ - మిగతా 2 లో

# కాశీలో చంద్రబాబు
# 'వి.కె.ఎస్.' మంత్రం

- వాగ్ధాటితో అదరగొట్టిన ఏపీ సీఎం చంద్రబాబు
- వారణాసిలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో చంద్రబాబు
- మోదీ పాలనను వివరిస్తూ 'వి.కె.ఎస్.' మంత్రాన్ని ఆవిష్కరించిన సీఎం
- కాశీలో బాలాజీ ఆలయానికి 10 ఎకరాలు కేటాయించాలని విజ్ఞప్తి
- చంద్రబాబు ప్రసంగానికి రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేక అభినందనలు
- ఎన్డీఏ బంధం చెక్కుచెదరదని, ఏపీకి అండగా నిలిచారని స్పష్టీకరణ



**అమరావతి :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా వారణాసిలో నిర్వహించిన 'కాశీ-వాద్‌నగర్ సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సభలో ఆయన తన వాగ్ధాటితో సభికులను ఉత్తేజపరిచారు. ప్రధాని మోదీ పాలన, దార్శనికత, దేశానికి అందిస్తున్న సేవలను వివరిస్తూనే, ఆంధ్రప్రదేశ్‌తో కేంద్ర ప్రభుత్వ బంధాన్ని బలంగా చాటిచెప్పారు. చంద్రబాబు ప్రసంగం ప్రారంభించకముందే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆయనను ప్రత్యేకంగా అభినందించడం, ప్రసంగం ముగిశాక "వెరీ వెల్... వెరీ వెల్" అంటూ ప్రశంసించడం సభలో అందరి దృష్టినీ ఆకర్షించింది. చంద్రబాబు తన ప్రసంగాన్ని హర హర మహాదేవ్ అంటూ ఆధ్యాత్మిక కోణంలో ఆరంభించడం విశేషం. ప్రధాని మోదీ ప్రస్థానాన్ని వివరిస్తూ చంద్రబాబు 'వి.కె.ఎస్.' అనే సరికొత్త మంత్రాన్ని ఆవిష్కరించారు. "వి అంటే మోదీ జన్మస్థలమైన వాద్‌నగర్, కె అంటే ఆయన కర్మభూమి అయిన కాశీ, ఎస్ అంటే ఆయన జన్మించిన సెప్టెంబర్ 17. ఈ 'వి.కె.ఎస్.' మంత్రం ప్రజాస్వామ్యంలో అత్యంత - మిగతా 2 లో

## రాష్ట్రంలో తీవ్ర కరవుపై
## ముందస్తు చర్యలు శూన్యం

- కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం
- రాష్ట్రంలో కరవు పరిస్థితులపై జగన్ ఆందోళన
- ఈ ఖరీఫ్‌లో సాగు 56.4 లక్షల ఎకరాలకే పరిమితమయిందన్న జగన్
- రైతులను నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన - మిగతా 2 లో


## తిరుమల చేరుకున్న
# ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్

- తిరుమల పర్యటనకు విచ్చేసిన ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్
- నేడు శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోనున్న గవర్నర్
- తిరుమలలో గవర్నర్‌కు స్వాగతం పలికిన టీటీడీ చైర్మన్, ఈవో
- రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం తిరుమల చేరుకున్నారు. శ్రీవారి దర్శనార్థం తిరుమల విచ్చేసిన ఆయనకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గవర్నర్ నేడు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోనున్నారు. గురువారం సాయంత్రం తిరుమలలోని శ్రీభాగ్య విశ్రాంతి భవనానికి చేరుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎం. రవిచంద్ర, సీవీఎస్‌వో మురళీకృష్ణ పుష్పగుచ్ఛం అందించి సాదరంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు నరేశ్, రిసెప్షన్ అధికారులు భాస్కర్, సాత్రే - మిగతా 2 లో

## మోదీ ప్రసంగాల్లో
# జెన్-జీ స్లాంగ్



- ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్ వాడుతున్న ప్రధాని మోదీ
- యువతకు చేరువయ్యేందుకు కొత్త కమ్యూనికేషన్ వ్యూహం
- 'ఫ్లెక్స్', 'ఫోమో', 'ఓజీ' వంటి పదాల వినియోగం
- ఎస్‌ఆర్‌సీసీ, ఇండియా-డెన్మార్క్ సదస్సుల్లో ఈ పదాల ప్రస్తావన
- యువ ఓటర్లను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా విశ్లేషణ

**ఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగ శైలిలో మార్పులు చేస్తూ, యువతకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా, నేటి తరం యువత (జెన్-జీ) ఎక్కువగా వాడే ఆధునిక పరిభాషను, స్లాంగ్ పదాలను తన ప్రసంగాల్లో ఉపయోగిస్తూ అందరినీ ఆకర్షిస్తున్నారు. ఆయన ప్రసంగాల్లో ఈ కొత్త పదజాలం వాడటం వెనుక, యువ ఓటర్లను ఆకట్టుకోవాలనే - మిగతా 2 లో

## మావోయిస్ట్
# అగ్రనేత లొంగుబాటు

- రూ.2.20 కోట్ల రివార్డు ఉన్న అగ్రనేత లొంగుబాటు
- మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు అసిమ్ మండల్ లొంగుబాటు
- జార్ఖండ్, ఒడిశాలలో కలిపి ఇతనిపై రూ.2.20 కోట్ల రివార్డు
- పలు హింసాత్మక ఘటనల్లో కీలక పాత్ర పోషించిన అసిమ్
- మండల్ నుంచి కీలక సమాచారం రాబట్టేందుకు అధికారుల ప్రయత్నం

2 లో..

## హైదరాబాద్ విలీనం కోసం మహనీయులు
# బలిదానాలు చేశారు

- ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది
- ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు
- పోలీస్ అమరవీరుల స్మృతి స్థూపం వద్ద నివాళులర్పించారు
- అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు.




**హైదరాబాద్ :** మహనీయుల పోరాటాలు కొత్త తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. 1947 ఆగస్టు 15 నుంచి జాతి నిర్మాణం కోసం పోరాటం మొదలైందని తెలిపారు. హైదరాబాద్ విముక్తి కోసం 1948లో ఆపరేషన్ పోలో చేపట్టారని, పోరాడిన యోధులకు నివాళులర్పిస్తున్నట్లు చెప్పారు. భారత్‌లో హైదరాబాద్ అంతర్భాగం కావడానికి మహనీయులు బలిదానాలు చేశారని స్మరించుకున్నారు. హైదరాబాద్ విముక్తిలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కృషి ఎంతో ఉందని, అది బలమైన భారత్ నిర్మాణానికి దోహదం చేసిందన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరయ్యారు. పోలీస్ అమరవీరుల స్మృతి స్థూపం వద్ద నివాళులర్పించి, జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ - మిగతా 2 లో

# సంపాదకీయం

## బ్రిటన్‌లో వేర్పాటు భేరి!



బ్రిటిష్ వలస పాలకులు తాము తప్పుకున్న మరుక్షణం భారత్ చిన్నాభిన్నం కావటం ఖాయమని జోస్యం చెప్పారు. ఇప్పుడు ఆ దేశమే ముక్కలయ్యే స్థితి ఏర్పడింది. మొన్న సోమవారం స్కాట్లాండ్, వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్ ఫస్ట్ మినిస్టర్‌లు(మన దగ్గర సీఎంల హోదాతో సమానం) అనధికార సమావేశం జరిపి, తమ స్వాతంత్ర్య ఆకాంక్షను వ్యక్తం చేసే ప్రకటనపై సంతకాలు చేశారు. దేశం కలిసుండాలా, విడిపోవాలా అనేది... అందుకు అనుసరించాల్సిన పద్ధతేమిటన్నది లండన్‌లోని జాతీయ పార్లమెంటు మాత్రమే నిర్ణయించాల్సిన అంశం కాబట్టి, ఇప్పటికప్పుడు దీనివల్ల జరిగేదేమీ ఉండదు. కానీ ఆర్థిక సంక్షోభాలు అగ్రరాజ్యాల్ని సైతం ఎలా కుదిపేస్తున్నాయో చెప్పడానికి తాజా పరిణామం ఉదాహరణ. అమెరికాపై పాతికేళ్లనాడు ఉగ్రదాడి జరిగినప్పుడు 3,000 మందిని పొట్టనబెట్టుకోవడం మినహా ఆ ఉగ్రవాదులు సాధించిందేమిటన్న ప్రశ్న వినబడింది. అటు తర్వాత అమెరికా సవ్యంగావుంటే ఉగ్రవాదం అంతరించేది. కానీ జరిగిందంతా అందుకు భిన్నం. అప్పట్లో అందరినుంచీ అమెరికాకు మద్దతు లభించింది. కొత్తగా అధికారంలోకొచ్చిన రష్యా అధినేత పుతిన్ అమెరికా ప్రారంభించిన 'ఉగ్రవాదంపై యుద్ధా'నికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, తాలిబన్ల వేటకు మధ్య ఆసియాలోని పూర్వపు సోవియెట్ సైనిక స్థావరాల వినియోగానికి ఉదారంగా అనుమతించారు. నాటో ఆవిర్భవించి అప్పటికి యాభైయ్యేళ్లు దాటగా... అందులోని మొదటి క్లాజు 'సమష్టి రక్షణ'ను తొలిసారి ఉపయోగించి ఆ సంస్థ అమెరికాకు బాసటగా నిలిచింది. ఇలా చిన్నా పెద్దా దేశాలన్నీ తాలిబన్‌ల వేటకు తోడ్పడ్డాయి.కానీ దీన్ని అమెరికా దుర్వినియోగం చేసింది. మానవహక్కుల ఉల్లంఘన సంగతలా వుంచి ఇరాక్ మొదలు పలు దేశాలపై విరుచుకుపడి ధ్వంసరచనకు, మారణహోమాలకు పాల్పడింది. లక్షల కోట్ల డాలర్లను మంచినీళ్లప్రాయంగా ఖర్చు చేసింది. ప్రతీకారేచ్ఛ క్రమంలో తాను దివాలా తీస్తున్నాననీ, నమ్ముకున్న వారిని నట్టేట ముంచుతున్నాననీ, చైనాపై కన్నేసి వుంచాలన్న సంగతి మరిచాననీ గ్రహించలేక పోయింది. ఉగ్రదాడికి ముందు మిగులు బడ్జెట్‌లో ఉన్న అమెరికా ఇప్పుడు 40 లక్షల కోట్ల డాలర్లకుపైగా అప్పుల్లో కూరుకుపోయింది. కరోనా మహమ్మారి పాత్ర కూడా ఇందులో ఉండొచ్చు గానీ... విచక్షణారహిత యుద్ధాల పరంపరే దాన్ని ఈ స్థితికి చేర్చింది. 'తిలా పాపం తలా పిడికెడు' అన్నట్టు యుద్ధాల్లో పాలుపంచుకున్న నాటో బలహీన పడింది. అన్ని దేశాలూ ఆర్థిక సుడిగుండంలో చిక్కుకున్నాయి. ఈ కష్టాల పరంపరనుంచి గట్టెక్కటం కోసమే ఆరేళ్ల క్రితం ఈయూ నుంచి బ్రిటన్ బయటికొచ్చింది. బ్రెగ్జిట్ రిఫరెండమ్‌లో దీన్ని నార్తర్న్ ఐర్లాండ్, స్కాట్లాండ్ ప్రజానీకం తిరస్కరించారు. కానీ వారి అభీష్టానికి విలువ లేకుండాపోయింది. ఇప్పుడు బ్రిటన్‌నుంచి విడిపోవటంతోపాటు ఈయూలో చేరటం కూడా ఈ ముగ్గురు అధినేతల ఎజెండా. చారిత్రకంగా మన రాష్ట్రాల కన్నా వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్, స్కాట్లాండ్ భిన్నమైనవి. వేల్స్‌ను 13వ శతాబ్దంలో ఇంగ్లండ్ ఆక్రమించుకుంది. రాచరికాలు చుట్టరికం కలుపుకోవటంతో స్కాట్లాండ్,ఇంగ్లండ్ కలిసి ప్రయాణించి వందేళ్ల తర్వాత కలిసి 1703లో గ్రేట్ బ్రిటన్‌గా ఏర్పడ్డాయి. 1801లో దానిలో చేరిన ఐర్లాండ్ 1921లో విడిపోయింది. కానీ ఉత్తర ప్రాంతంలోని ఆరు కౌంటీలు యూకేలోనే కొనసాగుతామన్నాయి.బ్రిటన్ తప్పుడు నిర్ణయాలతో అన్ని ప్రాంతాలనూ భ్రష్టు పట్టించటంతోపాటు, వాటి అధికారాలను కుదిస్తూవచ్చింది. పన్నుల ఆదాయాన్ని సరిగా పంచక 90 దశకం చివర్లో హామీ ఇచ్చిన స్వయంప్రతిపత్తి హోదాకు ముప్పు తెస్తోందన్నది వాటి అభిప్రాయం. నిరుద్యోగం, జనాభా క్షీణతపై తమకు సరైన నిర్ణయాధికారాలు లేవని వాటి ఫిర్యాదు. సంక్షోభాలు చుట్టుముట్టినప్పుడైనా సక్రమంగా వ్యవహరించటం చేతకాకపోతే అవి మరింత ముదురుతాయి. ఫెడరల్ వ్యవస్థను నీరుగార్చి ప్రశాంతంగా మనుగడ సాగించా లనుకోవటం చెల్లదని బ్రిటన్ పాలకులు గుర్తించకపోతే... ఇప్పటికి కేవలం రాజకీయ హెచ్చరికగానే తలెత్తిన ఈ నిరసన ఆ ప్రాంత జనాభాను తాకడానికి ఎన్నాళ్లో పట్టదు. అప్పుడు బ్రిటన్ లండన్‌గా మిగిలిపోక తప్పదు. చేసిన పాపాలు శాపాలై వెంటాడ తాయంటారు. మనతో సహా అనేక దేశాలను పీల్చిపిప్పిచేసిన బ్రిటన్ ఇప్పుడు ఇల్లు చక్కదిద్దుకోగలదా అన్నది వేచిచూడాలి.

## రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం

**మొదటిపేజీ తరువాయి -** జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు.సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ క్షేత్రస్థాయి కార్యాచరణ చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

## తిరుమల చేరుకున్న ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్

**మొదటిపేజీ తరువాయి -** నాయక్ తదితరులు పాల్గొన్నారు.అంతకుముందు, రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న గవర్నర్‌కు జిల్లా ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు విమానాశ్రయంలో గవర్నర్‌కు స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ రోడ్డు మార్గంలో తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

## చరిత్రకు మతం రంగు పులిమే ప్రయత్నం జరుగుతోంది


**మొదటిపేజీ తరువాయి -** పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 తెలంగాణ పౌరుషానికి, పోరాట పటిమకు, త్యాగాల చరిత్రకు నిదర్శనమన్నారు. అయితే ఈ చారిత్రక రోజును కాంగ్రెస్, బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరిస్తున్నాయని విమర్శించారు.తెలంగాణ విలీనానికి స్టేట్ కాంగ్రెస్ పోరాటమే కారణమని సీఎం చెబుతున్నారని, అది వాస్తవం కాదని కవిత అన్నారు. సంస్థానాల్లో పోరాటం చేయడం తమ విధానం కాదని అప్పట్లో మహాత్మా గాంధీ చెప్పిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. నిజాం ప్రభుత్వం పేదలకు ఇచ్చిన 10 లక్షల ఎకరాల భూమిని భారత యూనియన్‌లో విలీనం తర్వాత కాంగ్రెస్ తిరిగి జమీందార్లకు అప్పగించిందని ఆరోపించారు.బీజేపీ తీరుపైనా కవిత మండిపడ్డారు. ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటంగా ఆనాటి చరిత్రకు మతం రంగు పులిమేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఆ పోరాటం జరిగిన సమయంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఉనికిలోనే లేవని అన్నారు.జాగీర్దార్లు, జమీందార్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా మతాలకు అతీతంగా ప్రజలే స్వచ్ఛందంగా పోరాటం చేశారని కవిత తెలిపారు. వట్టికోట ఆళ్వార్ స్వామి, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి వంటి వారు సైకిళ్లపై తిరుగుతూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని గుర్తుచేశారు.కాళోజీ, దాశరథి, షోయాబుల్లాఖాన్, మగ్దూం మొయినుద్దీన్ వంటి కవులు, రచయితలు తమ రచనలతో ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపారని చెప్పారు. వారి స్ఫూర్తితో దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి వంటి వారు పోరాటంలో ముందుకు వచ్చారని పేర్కొన్నారు.అదే స్ఫూర్తితో తెలంగాణ రక్షణ సేన కూడా కులమతాలకు అతీతంగా ప్రజల హక్కుల కోసం పోరాడుతుందని కవిత అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలనకు అంతం పలికే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# కాశీలో చంద్రబాబు 'వి.కె.ఎస్.' మంత్రం

**మొదటిపేజీ తరువాయి -** శక్తివంతమైనది. సానుకూల దృక్పథంతో కృషి చేస్తే ఎవరైనా అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చని మోదీ నిరూపించారు" అని చంద్రబాబు అన్నారు. సామాన్య కుటుంబంలో పుట్టి, రైల్వే స్టేషన్‌లో టీ అమ్ముతూ, కష్టపడి చదువుకుని దేశ ప్రధాని స్థాయికి ఎదగడం యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.మోదీ నాయకత్వంలో గత పదేళ్లలో దేశంలో జరిగిన అభివృద్ధిని చంద్రబాబు అంకెలతో సహా వివరించారు. "మోదీ పాలనలో 25 కోట్ల మంది బహుముఖ పేదరికం నుంచి బయటపడ్డారు. 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు, 12 కోట్ల కుటుంబాలకు మరుగుదొడ్లు, 4 కోట్ల మందికి గృహ వసతి కల్పించారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించాలన్నది ఆయన కల. పీఎం కిసాన్ కింద 11 కోట్ల మంది రైతులకు మధ్యవర్తులు లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు" అని తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలో 140 కోట్ల మంది ప్రజల ప్రాణాలను కాపాడటమే కాకుండా, 100 దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్లు అందించి మానవత్వాన్ని చాటుకున్నారని ప్రశంసించారు.రక్షణ రంగంలో భారత్ సాధించిన ప్రగతిని చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఒకప్పుడు రక్షణ పరికరాలను దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ నేడు మనమే సొంతంగా తయారు చేసుకుంటున్నాం. స్పేస్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, సెమీకండక్టర్, క్వాంటమ్ టెక్నాలజీ వరకు అన్నింటిపైనా అవగాహన ఉన్న ఏకైక నేత మోదీ" అని కొనియాడారు. స్టార్టప్‌ల ద్వారా యువత ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదిగిందని, మహిళా సాధికారతకు -బేటీ బచావో- నుంచి -లఖ్‌పతి దీదీ- వరకు అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు.తన ప్రసంగంలో భాగంగా ఆయన అయోధ్య రామజన్మభూమి అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దశాబ్దాలుగా నలుగుతున్న అయోధ్య వివాదాన్ని ప్రధాని నరేంద్ర మోదీ పరిష్కరించి, రామ మందిర కలను సాకారం చేశారని చంద్రబాబు కొనియాడారు. ఈ సందర్భంగా సభికులను ఉద్దేశించి "నేను చెప్పింది నిజమే కదా?" అని ప్రశ్నిస్తూ, అందరితో "జై శ్రీరామ్" అని గట్టిగా నినాదాలు చేయించారు. దీంతో వారణాసిలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్ ఒక్కసారిగా ఆ నినాదాలతో మార్మోగింది.ఈ సందర్భంగా చంద్రబాబు ఒక ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. "నేను పవిత్రమైన తిరుమల శ్రీ బాలాజీ కొలువైన నేల నుంచి వచ్చాను. ఈ చారిత్రక కాశీ నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలనుకుంటున్నాం. దీని కోసం 5 నుంచి 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కోరుతున్నాను" అని అన్నారు. ఈ ప్రకటనకు సభికుల నుంచి భారీ స్పందన లభించింది. అయోధ్యలో రామమందిర నిర్మాణం చరిత్రాత్మకమని, వారసత్వ సంపదను కాపాడుతూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం మోదీకే సాధ్యమైందని చంద్రబాబు అన్నారు.ఎన్డీఏ కూటమి బంధం విడదీయరానిదని చంద్రబాబు స్పష్టం చేశారు. "అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం మాకు అండగా నిలిచింది. సహకార సమాఖ్య స్ఫూర్తి మాకు కేవలం నినాదం కాదు, అది మా రోజువారీ అనుభవం. మేం కలిసే ఉన్నాం, భవిష్యత్తులోనూ కలిసే ఉంటాం. మన ఐక్యతే దేశానికి బలం" అని పునరుద్ఘాటించారు. సరైన సమయంలో, సరైన ప్రదేశంలో, సరైన నాయకుడు ఉండటం దేశానికి లభించిన గొప్ప అదృష్టమని, ఆ నాయకుడే నరేంద్ర మోదీ అని చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు. ఆయన ప్రసంగానికి సభికులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు.

## మోదీ ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్

**మొదటిపేజీ తరువాయి -** స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది .ఇటీవల ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ కళాశాల పూర్వ విద్యార్థులను 'ఓజీ'లుగా అభివర్ణించారు. జెన్-జీ పరిభాషలో 'ఓజీ' అంటే 'ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్' అని అర్థం. అంటే తమ రంగంలో అత్యంత ప్రావీణ్యం ఉన్నవారిని,



ప్రత్యేకమైన వారిని గౌరవంగా ఇలా పిలుస్తారు. ఇదే ప్రసంగంలో 'ఫ్లెక్స్' అనే పదాన్ని కూడా ఆయన వాడారు. "ఈ రోజుల్లో కూడా ఢిల్లీ యూనివర్సిటీలో మీరు ఎస్ఆర్‌సీసీ విద్యార్థి అని చెప్పుకోవడం ఒక 'ఫ్లెక్స్' లాంటిది" అని ఆయన వ్యాఖ్యానించారు. తమకున్న హోదాను, నైపుణ్యాన్ని లేదా విజయాన్ని గర్వంగా ప్రదర్శించడాన్ని 'ఫ్లెక్స్' అంటారు.ఇంతకుముందు 2022లో డెన్మార్క్ ప్రధానితో కలిసి ఇండియా-డెన్మార్క్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రసంగిస్తూ ప్రధాని 'ఫోమో' అనే పదాన్ని ప్రస్తావించారు. 'ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్' అనే పదబంధానికి సంక్షిప్త రూపమే ఈ 'ఫోమో'. సోషల్ మీడియాలో ఈ పదం చాలా ప్రాచుర్యం పొందింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టని వారు గొప్ప అవకాశాన్ని కోల్పోతారని, వారు 'ఫోమో'కు గురవుతారని చెప్పడానికి మోదీ ఈ పదాన్ని చమత్కారంగా ఉపయోగించారు.ప్రధాని మోదీ ఈ తరహా పదాలను ఉపయోగించడం ఒక విస్తృత కమ్యూనికేషన్ వ్యూహంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియా, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ తరహా కంటెంట్‌తో యువతను ఆకట్టుకోవడం దీని ప్రధాన ఉద్దేశం.సంప్రదాయ రాజకీయ ప్రసంగాలకు భిన్నంగా, మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను మలచుకుంటూ యువతరంతో మమేకం అయ్యేందుకు మోదీ చేస్తున్న ఈ ప్రయత్నం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

## తెలంగాణ గడ్డ స్వభావం అన్యాయాన్ని ఎదిరించడం

**మొదటిపేజీ తరువాయి -** స్థాయి గుర్తింపు సాధించిందన్నారు. అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, అణచివేతలు చివరి దశలో రజాకార్ల దౌర్జన్యాలు ప్రజలను కల్లోల పరిచాయని గుర్తు చేశారు.భారతదేశంలో అంతర్భాగం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలపడిందని, నిజాం ఆంధ్ర మహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు రగిలాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి కోసం కమ్యూనిస్టులు పోరాటం చేశారని అన్నారు. రావి నారాయణ రెడ్డి, భీంరెడ్డి నర్సింహా రెడ్డి, చాకలి ఐలమ్మ వంటి యోధులు పోరాటాలకు నాయకత్వం వహించడం గొప్ప విషయమన్నారు. హైదరాబాద్ ప్రజల ఆకాంక్ష మేరకు నెహ్రూ, పటేల్ నాయకత్వంలో సైనిక చర్య చేపట్టారని వివరించారు.తరతరాల అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ. అస్తిత్వం, ఆత్మ గౌరవం, హక్కుల కోసం ఈ నేల ప్రజా చైతన్యాన్ని రగిలించింది. సమ్మక్క-సారలమ్మ పోరాటం నుంచి సాయుధ పోరాటం వరకు అన్యాయాన్ని ఎదిరించడం ఈ గడ్డ స్వభావం. - సీఎం రేవంత్? రెడ్డిఆపరేషన్ పోలో అనంతరం ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ భారత ప్రభుత్వానికి లొంగిపోయినట్లు సీఎం తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ అధికారికంగా భారత్‌లో అంతర్భాగమైందన్నారు. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం సెప్టెంబరు 17వ తేదీ అని గుర్తుచేశారు.సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకుంటున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి, ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజాపాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. తెలంగాణ పొరుగు రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంతో పోటీపడుతోందని చెప్పారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18 లక్షలుగా ఉందని, దేశ తలసరి ఆదాయం కంటే 91 శాతం ఇది అధికమని అన్నారు.కృష్ణా నదీ జలాల్లో తెలంగాణ వాటా కోసం న్యాయ పోరాటం చేస్తున్నామని, పెండింగ్ ప్రాజెక్టులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి తెలంగాణను సస్యశ్యామలం చేస్తామని సీఎం చెప్పారు. తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలని, ఆర్థిక స్వావలంబన సాధించాలనేది తమ ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. 1.06 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, 2.25 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రకటించారు. ప్రతి కుటుంబం ఆత్మ గౌరవంతో జీవించాలనేది తమ ప్రభుత్వ ఆశయమన్నారు. హైదరాబాద్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను రాష్ట్రపతి ఆమోదానికి పంపినట్లు గుర్తు చేశారు.

## మావోయిస్ట్ అగ్రనేత లొంగుబాటు



**మొదటిపేజీ తరువాయి -** మావోయిస్టు పార్టీకి పెను దెబ్బ తగిలింది. సీపీఐ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ సభ్యుడైన అసిమ్ మండల్ అలియాస్ ఆకాశ్ పశ్చిమ బెంగాల్‌లో లొంగిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఇతనిపై జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాలు భారీ మొత్తంలో రివార్డులు ప్రకటించాయి. జార్ఖండ్ ప్రభుత్వం ఇతని తలపై రూ.1 కోటి రివార్డు ప్రకటించగా, ఒడిశా ప్రభుత్వం రూ.1.20 కోట్లు రివార్డు ప్రకటించింది. మొత్తం మీద ఇతనిపై రూ.2.20 కోట్ల రివార్డు ఉంది.పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మేదినీపూర్ జిల్లా, చంద్రకోన పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉత్తర ఫుల్‌చుక్ గ్రామ నివాసి అయిన అసిమ్ మండల్.. మావోయిస్టు పార్టీలో ఆకాశ్, తిమిర్, మనోజ్, దీపక్, రాకేశ్ వంటి పలు పేర్లతో కార్యకలాపాలు సాగించాడు. ముఖ్యంగా జార్ఖండ్‌లోని కోల్హాన్, సారండా ప్రాంతాల్లో అనేక సంవత్సరాలుగా మావోయిస్టు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. ఇతని లొంగుబాటును జార్ఖండ్ పోలీసులు కూడా ధృవీకరించారు.జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఇతనిపై సుమారు 55 తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీటిలో చాలా వరకు భద్రతా బలగాలపై దాడులు, ఎన్‌కౌంటర్లకు సంబంధించినవే. 2026 మార్చి 1న చైబాసాలోని మరంగ్‌పొంగ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో కోబ్రా 209వ బెటాలియన్‌కు చెందిన అసిస్టెంట్ కమాండెంట్‌తో సహా ఇద్దరు భద్రతా సిబ్బంది గాయపడటంలో ఇతని పాత్ర ఉంది. అలాగే, 2025 ఏప్రిల్ 12న రాధాపోర వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక జార్ఖండ్ జాగ్వార్ జవాన్ మరణించాడు.ఇవేకాక, 2023 జనవరి 11న టోంటో పోలీస్ స్టేషన్ పరిధిలోని తుంబహాక అటవీ ప్రాంతంలో జరిగిన ఐఈడీ పేలుడులో 9 మంది కోబ్రా బెటాలియన్ సిబ్బంది గాయపడ్డారు. 2020 మే 31న జోన్వాలో, 2018 జులై 11న ఝూటీ పహారీలో జరిగిన దాడుల్లో చెరొక భద్రతా సిబ్బంది మరణించారు. ఈ ఘటనలన్నింటిలోనూ అసిమ్ మండల్ కీలక సూత్రధారిగా ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి.ప్రస్తుతం అసిమ్ మండల్‌ను అదుపులోకి తీసుకున్న భద్రతా ఏజెన్సీలు.. మావోయిస్టుల నెట్‌వర్క్, ఆయుధ నిల్వలు, రహస్య స్థావరాలపై కీలక సమాచారం రాబట్టేందుకు విచారిస్తున్నాయి. ముఖ్యంగా సారండా అడవుల్లో దాచిపెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాల గురించి ఇతని ద్వారా కీలక సమాచారం లభించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ లొంగుబాటుతో మావోయిస్టు ఉద్యమానికి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

## హైదరాబాద్ విలీనం కోసం మహనీయులు బలిదానాలు చేశారు

**మొదటిపేజీ తరువాయి -**

శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి మీద పాట రూపంలో అద్భుతమైన కార్యక్రమం నిర్వహించారు. నృత్య రూప ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.తెలంగాణ విమోచన దినోత్సవ వట్టడుకలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రసంగిస్తూ నిజాం అద్భుత పాలన చేశాడన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న వేళ అసెంబ్లీలో సీఎం వ్యాఖ్యలు శోచనీయమని నిప్పులు చెరిగారు. నిజాం అంత మంచొడైతే వందేమాతరం రాంచందర్‌రావు, భాగ్యరెడ్డి వర్మ, బండి యాదగిరి, కోదాటి నారాయణ రావు, రాంజీగోండు, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, రావి నారాయణ రెడ్డి, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, ముఖ్ధం మొహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, ప్రభాకర్‌రావు, కుమురం భీం, బోమ్మగాని ధర్మభిక్షం గౌడ్, సుద్దాల హనుమంతు, నారాయణరావు పవార్ వంటి యోధులు ఎందుకు పోరాటం చేశారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. నిజాం మీద భారత ఆర్మీ ఎందుకు యుద్ధం చేసిందో చెప్పాలని అన్నారు. రాజకీయాలు, అధికారం కోసం ఎంతకైనా దిగజారుతామనే విధంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన ఉందని విమర్శించారు."భారత్‌లో హైదరాబాద్ అంతర్భాగం కావడానికి మహనీయులు బలిదానాలు చేశారు. మహనీయుల పోరాటాలు కొత్త తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయి. 1947 ఆగస్టు 15 నుంచి జాతి నిర్మాణం కోసం పోరాటం మొదలైంది. హైదరాబాద్ విముక్తి కోసం 1948లో ఆపరేషన్ పోలో చేపట్టారు. హైదరాబాద్‌ను విముక్తి చేయడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కృషి ఎంతో ఉంది" -రాధాకృష్ణన్, ఉపరాష్ట్రపతిఅసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి నిజాం గొప్ప వాడని పొగుడుతున్నారని, ఇలాంటి వారి డీఎన్ఏను పరీక్షించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. తెలంగాణ చరిత్రను తెరమరుగు చేసే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ చరిత్రను భావితరాలకు తెలియజెప్పే విధంగా ప్రధాని నరేంద్ర మోదీ విమోచన దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అవినీతి, ఆరోపణలు లేకుండా పాలన చేస్తుందని వివరించారు. తెలంగాణలో మార్పు కోసం రాష్ట్ర ప్రజలు ఆలోచించాలన్నారు.13 నెలలు ఆలస్యంగా తెలంగాణ గడ్డకు స్వాతంత్ర్యం వచ్చిందన్న బండి సంజయ్, రాష్ట్ర ప్రజలపైన జరిగిన మారణకాండను పాలకులు 80 ఏళ్లుగా తొక్కి పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మజ్లీస్‌కు భయపడి, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం రజాకార్ల దౌర్జన్యాలను దాచి పెట్టారని అన్నారు. రజాకార్ల సంస్థ 1940లో ప్రారంభించి హిందువులు, దేవాలయాలపై దాడులు చేశారని తెలిపారు. తెలుగు అనాగరిక భాష అని నిషేధించి పరభాష అయిన ఉర్దూను మన మీద రుద్దారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజాంను పొగడటం సిగ్గు చేటని వ్యాఖ్యానించారు. నిజాం గొప్పవాడైతే చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, మల్లు స్వరాజ్యం, రావి నారాయణ రెడ్డి వంటి వారు ఎందుకు పోరాటం చేశారో రేవంత్ రెడ్డి చెప్పాలన్నారు. నిజాం మంచోడు అయితే తెలంగాణ గ్రామ గ్రామన ఎందుకు బురుజులు కట్టుకున్నారో సీఎం చెప్పాలని నిలదీశారు.నిజాం పోయిన ఆయన వారసత్వమైన మజ్లీస్ పార్టీ అరాచకాలు సృష్టిస్తోందని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 1980 నుంచి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ డిమాండ్ చేస్తూ వస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఐదేళ్లుగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 2029లో బీజేపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణలో ప్రతి గ్రామ గ్రామాన అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను నిర్వహిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు

నల్గొండ స్థానాలకు ఓటర్ల నమోదు ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది.ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 20న ఓటర్ల నమోదుకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేయనున్నారు. అప్పటి నుంచి నవంబర్ 6 వరకు అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు గడువు ఉంటుంది. వీటిని పరిష్కరించిన అనంతరం, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఒక కీలక విషయాన్ని స్పష్టం చేశారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా పేరు నమోదు చేసుకున్న వారు కూడా తప్పనిసరిగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాత ఓటు రద్దవుతుందని, కొత్త జాబితాలో పేరు నమోదైతేనే ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం ఈ రెండు స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీలు వాణీదేవి, తీన్మార్ మల్లన్నల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియను ప్రారంభించింది.



సీమకిరణం
కర్నూలు నంద్యాల
తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



# వైద్య విద్య.. వృత్తి కాదు.. జీవిత లక్ష్యం!

ఎంబీబీఎస్ విద్యార్థులకు ప్రిన్సిపల్ డా. కె. చిట్టి నరసమ్మ స్ఫూర్తిదాయక సందేశం

కర్నూలు మెడికల్ కాలేజీలో 2026--27 బ్యాచ్‌కు ఘనంగా ఓరియెంటేషన్ కార్యక్రమం

"జ్ఞానానికి మానవత్వం తోడైతేనే సంపూర్ణ వైద్యులుగా ఎదుగుతారు

"వైద్యులుగా ఎదగండి.. మానవత్వాన్ని మరువకండి!"

కర్నూలు మెడికల్ కాలేజీ నూతన ఎంబీబీఎస్ విద్యార్థులకు ప్రిన్సిపల్ డా. కె. చిట్టి నరసమ్మ దిశానిర్దేశం






**కర్నూలు వైద్యం, సెప్టెంబర్ 15, (సీమకిరణం న్యూస్):** 2026--27 విద్యా సంవత్సరంలో కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన నూతన విద్యార్థులకు మంగళవారం న్యూ లెక్చరర్ గ్యాలరీలో ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ డీఎంఈ, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా. కె. చిట్టి నరసమ్మ అధ్యక్షత వహించి నూతన విద్యార్థులకు విలువైన, స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. "వైద్య విద్య మీకు ఒక వృత్తిని మాత్రమే కాదు.. ఒక జీవిత లక్ష్యాన్ని, సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశాన్ని అందిస్తుంది" అని అన్నారు. వైద్య వృత్తిలో జ్ఞానంతో పాటు మానవత్వం, సేవాభావం, నైతిక విలువలు అత్యంత ముఖ్యమని తెలిపారు. "మీ చేతుల్లో భవిష్యత్తులో ఎన్నో ప్రాణాల బాధ్యత ఉంటుంది. అందుకే ఈరోజు నుంచే మంచి విద్యార్థులుగా మాత్రమే కాకుండా.. సామాజిక బాధ్యత కలిగిన మంచి మనుషులుగా ఎదగడానికి కృషి చేయాలి" అని విద్యార్థులకు సూచించారు. అలాగే "రోగి మీ వద్దకు వచ్చినప్పుడు అతనిలో ఒక వ్యాధిని మాత్రమే చూడకండి.. ఒక మనిషిని చూడండి. మీ జ్ఞానానికి మానవత్వం తోడైతేనే మీరు సంపూర్ణ వైద్యులుగా ఎదుగుతారు" అని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన, నిరంతర అధ్యయనం, పరిశీలనా దృక్పథం, కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కర్నూలు మెడికల్ కాలేజీకి ఉన్న ఘనమైన చరిత్ర, వైద్య రంగంలో ఉన్న ప్రత్యేక గుర్తింపును నూతన విద్యార్థులు మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.




**కళాశాలపై సమగ్ర అవగాహన..**

ఓరియెంటేషన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కళాశాలలోని వివిధ విభాగాలు, బోధనా విధానం, విద్యా ప్రణాళిక, పరీక్షా విధానం, విద్యార్థుల క్రమశిక్షణ, కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా, ఇతర సౌకర్యాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా నూతన విద్యార్థులకు వైద్య విద్యపై స్పష్టమైన అవగాహన కల్పించడంతో పాటు, భవిష్యత్తులో బాధ్యతాయుతమైన వైద్యులుగా ఎదగాలనే స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ సీ.ఎస్.కె. ప్రకాష్, వైస్ ప్రిన్సిపల్ డా. హరి చరణ్, డా. శ్రీరాములు, డిప్యూటీ సూపరింటెండెంట్ డా. నాగేశ్వరరావు, వివిధ విభాగాధిపతులు డా. బ్రహ్మాజీ, డా. రాజేష్, డా. ఎలిజబెత్ రాణి, డా. బాలేశ్వరి, డా. కిరణ్మయి, డా. నాగజ్యోతి, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు డా. మాధవి శ్యామల, డా. రాజయ్య, డా. ఉమ, డా. రాధిక, డా. అరుణ, డా. చక్రపాణి, డా. ప్రవీణ, డా. రవి నాయక్, డా. శరణ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్యాపిలిలో ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు





**ప్యాపిలి, సెప్టెంబర్ 17 (సీమ కిరణం న్యూస్) :** దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను ప్యాపిలి మండలంలో బీజేపీ నాయకులు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షుడు పూజారి శివ కేశవులు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఆవరణలో కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఒకరికొకరు మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, ప్రపంచంలో భారతదేశ కీర్తి ప్రతిష్టలు పెరిగాయని కొనియాడారు. మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ఉపఅధ్యక్షుడు కేసీ మాదిలేటి, మండల అధ్యక్షుడు దామోదర్ నాయుడు, గణేష్, మధు, శ్రీకాంత్, సునీల్, హరి ప్రసాద్, రాజేష్, కిరణ్, పాండు, రఫీ, ఆటో జానీ, రాజశేఖర్, విక్రమ్, రంజిత్, మహేష్,బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సీ కాలనిలో తీవ్రమైన నీటి కష్టాలు

పట్టించుకోని అధికారులు



**ప్యాపిలి సెప్టెంబర్ 17 (సీమ కిరణం న్యూస్):** మండల పరిధిలోని కలచట్ల గ్రామంలోనీ ఎస్సీ కాలనిలో తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. నీటి కోసం మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు అధికారులతో ఎంత మోరపెట్టుకున్న సమస్యను పరిష్కరించే ఆలోచన చెయ్యటం లేదు. నీటి సరఫరాకు కాలనీ చుట్టూ 3 కాళి బోర్లు ఉన్నప్పటికీ వాటిని ఉపయోగించే ఆలోచన అధికారులకు రావటం లేదు ఒక బోర్ల నుంచి నీరు అరకొరగా వస్తుంది. ఇంతకముందు రెండు మోటార్స్ ద్వారా నీటిని ఓవర్ ట్యాంక్ కు పంపించేవారు, ఇంకొక మోటార్ ఎక్కడికి పోయిందో తెలియని పరిస్థితి అని కాలనీ వాసులు బాధపడుతున్నారు.స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రజలు కొళాయిలో నీరు రాలేదని గ్రామ సచివాలయ కార్యాలయం అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు ప్రజలు, విద్యార్థులకు నీరు లేక చాలా ఇబ్బంది పడుతున్నారని అధికారులకు 10 రోజుల నుండి నీరు రావటం లేదని మోరపెట్టుకున్న పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఏఅధికారి కూడా స్పందించిన పాపాన పోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్త వస్తున్నారు . ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీరు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష




**డోన్ టౌన్, సెప్టెంబర్ 17,(సీమ కిరణం న్యూస్):** డోన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్ . నూరుల్లా ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష , విధించినట్లు రూరల్ సీ ఐ రాకేష్, ఎస్సై మమత తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్లో నమోదైన డ్రంకన్ అండ్ డ్రైవ్ కేసులో , హరిజన రాజ్ (30), బొంతిరాళ్ళ గ్రామం , క్రిష్ణగిరి మండలం , కర్నూలు జిల్లా , అను నతనికి రెండు రోజులు జైలు శిక్ష విధించడం జరిగింది. మద్యం సేవించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల డ్రైవర్ ప్రాణాలతో పాటు అమాయక ప్రజల ప్రాణాలు కూడ ప్రమాదంలోకి పడతాయని, ఎవరు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి, కోర్టు ముందు హాజరుపరుస్తామని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడపడం వలన భారీ జరిమానాలు, జైలు శిక్ష తప్పవని హెచ్చరించారు.. రోడ్డు ప్రమాదాలు పెరగకుండా ఉండాలంటే ప్రజలందరూ చట్టాన్ని కచ్చితంగా పాటించాలి. ఎవరైనా మద్యం సేవించి వాహనం నడిపితే వారి పై డోన్ రూరల్ పోలీస్ స్టేషన్ కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి వెనుకడుగు వేయరు. ప్రజలందరూ తమ ప్రాణాల రక్షణ కోసం, ఇతరుల ప్రాణాల రక్షణ కోసం మద్యం సేవించి వాహనాలు నడపరాదని డోన్ రూరల్ పోలీస్ స్టేషన్ వారు హెచ్చరించారు.

# ప్రతిభకు ప్రోత్సాహం.. విద్యార్థులతో కళకళలాడిన కోట్ల వారి గణేష్ ఉత్సవాలు..



**డోన్ టౌన్, సెప్టెంబర్ 17,(సీమ కిరణం న్యూస్):** డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కోట్ల వారి గణేష్ ఉత్సవాలు – – 2026 లో భాగంగా గురువారం ఉదయం నాలుగో రోజు విద్యార్థుల కోసం నిర్వహించిన డ్రాయింగ్ పోటీలు ఘనంగా నిర్వహించారు , పట్టణంలో చదువుతున్న విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సృజనాత్మకతను, కళా ప్రతిభను చాటుకున్నారు. ఈ పోటీలకు సుమారు 625 మంది విద్యార్థులు ఉత్సాహంగా హాజరై వివిధ అంశాలపై ఆకర్షణీయమైన చిత్రాలను గీసిన అందరు ఆకట్టుకున్నారు, చిన్నారుల నుంచి ఉన్నత తరగతుల విద్యార్థుల వరకు అందరూ ఎంతో ఆసక్తితో పాల్గొనడం విశేషం, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారిలోని సృజనాత్మక ఆలోచనలకు వేదిక కల్పించాలనే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహించారు, ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి అవకాశాలు కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు,పోటీలను విజయవంతం చేసిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మరియు నిర్వాహకులకు ఉత్సవ కమిటీ సభ్యులు అందరు కృతజ్ఞతలు తెలిపారు.




# ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా 'ఆశీర్వాద్ కా దియా' వెలిగించిన మంత్రి టీజీ భరత్



**మంగళగిరి, సెప్టెంబర్ 17, (సీమకిరణం న్యూస్) :** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ 'ఆశీర్వాద్ కా దియా' (ఆశీర్వాద దీపం) వెలిగించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రధాని మోదీ చేస్తున్న కృషి మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో దేశానికి మరింత సేవ చేయాలని కోరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. దేశ ప్రగతికి ఆయన నాయకత్వం, దార్శనికత ఎంతో కీలకమని అన్నారు.

# ఎండిన వేరుశెనగ

రైతు కంట కన్నీరు

పంట చేతికందక అప్పుల భారం



**ప్యాపిలి, సెప్టెంబర్ 17 (సీమ కిరణం న్యూస్):** ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక వేరుశెనగ రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్యాపిలి మండల వ్యాప్తంగా వందల ఎకరాల్లో వేరుశెనగ పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలచట్ల గ్రామంలోని హరిజనవాడకు చెందిన ఓ రైతు ఖరీఫ్ సీజన్‌లో నాలుగు ఎకరాల్లో వేరుశెనగ సాగు చేశారు. ఎకరాకు సుమారు రూ.35 వేల నుంచి రూ.45 వేల వరకు పెట్టుబడి పెట్టినప్పటికీ, వర్షాభావంతో పంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో పెట్టుబడి కూడా చేతికి రాక అప్పుల భారం పెరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పంట చేతికందకపోవడంతో కనీసం పశువులకు వారం రోజులైనా మేతగా ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ఎండిపోయిన నాలుగు ఎకరాల వేరుశెనగ పంటను పాయించినట్లు తెలిపారు. రైతులకు అండగా నిలిచే పశువులను పోషించడం కూడా భారంగా మారిందని, మేత కొరతతో ఎద్దులు, పశువులను అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతోందని వాపోయారు. పంట కోసం ఎదురుచూశాం.చివరకు పశువుల మేతగా కూడా ఉపయోగపడుతుందో లేదో తెలియని పరిస్థితి. అప్పులు ఎలా తీర్చాలో, పశువులను ఎలా పోషించాలో అర్థం కావడం లేదు" అంటూ రైతు కన్నీటి పర్యంతమయ్యారు. వర్షాభావంతో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎండిన పంటలకు నష్టపరిహారం అందించడంతో పాటు పశువులకు ఉచితంగా మేత అందించి మూగజీవాలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

# మంత్రి టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరిన మాజీ కార్పొరేటర్ పల్లవి



**మంగళగిరి, సెప్టెంబర్ 17, (సీమకిరణం న్యూస్) :** కర్నూలు నగరంలోని 18వ వార్డు మాజీ కార్పొరేటర్ పల్లవి, తన అనుచరులతో కలిసి మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ సమక్షంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ పల్లవి మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో మంత్రి టీజీ భరత్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని, కర్నూలు నగర అభివృద్ధికి మంత్రి టీజీ భరత్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ప్రేమకాంత్, మురళి మోహన్, విజయ్ కుమార్, ప్రతాప్, బాబీ, మహాలక్ష్మి ఉన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గణేష్ సింగ్, బిజెపి నాయకులు రాఘువేంద్ర, అవేజ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

# మైండ్ బ్లోయింగ్ ప్లాన్.. రూ.50 కదా అని లైట్ తీసుకోకండి.. 10 ఏళ్లలో రూ.3.52 లక్షలు!

పెట్టుబడిని ప్రారంభించేటప్పుడు మార్కెట్ హెచ్చుతగ్గులను అర్థం చేసుకోవడం ముఖ్యం. మీరు ఈక్విటీల వంటి మార్కెట్‌తో ముడిపడి ఉన్న ఆప్షన్లలో పెట్టుబడి పెడితే, మీ పెట్టుబడి విలువ కొన్నిసార్లు పెరగవచ్చు. మరికొన్నిసార్లు తగ్గవచ్చు. తక్కువ మొత్తంతో ప్రారంభించడం వల్ల మార్కెట్. రోజుకురూ.50 ఆదా చేయడం చిన్న విషయంగా అనిపించవచ్చు. ఇంత చిన్న మొత్తం వల్ల ఎంత ప్రయోజనం ఉంటుంది? కానీ మీరు ప్రతిరోజూ ఈ చిన్న మొత్తాన్ని పక్కన పెట్టడం ప్రారంభిస్తే, అది 30 రోజుల్లో రూ. 1,500గా, ఒక సంవత్సరంలో రూ. 18,000గా పెరగగలదు. అంటే, మీరు రెండు కప్పుల టీ లేదా ఇతర చిన్న చిన్న రోజువారీ ఖర్చుల కోసం వెచ్చించే డబ్బును క్రమం తప్పకుండా ఆదా చేస్తే, కొన్ని సంవత్సరాలలోనే మీరు గణనీయమైన మొత్తాన్ని కూడబెట్టుకోవచ్చు. అందుకే పెట్టుబడి పెట్టడానికి ఎల్లప్పుడూ పెద్ద మొత్తంతో ప్రారంభించాల్సిన అవసరం లేదు. మీరు ఇప్పటికే పెట్టుబడి పెట్టడం ప్రారంభించకపోతే రోజుకు రూ. 50 వంటి చిన్న మొత్తంతో ప్రారంభించడం పొదుపు అలవాటును పెంపొందించుకోవడానికి ఒక సులభమైన మార్గం. ఈ రోజువారీ రూ. 50 పొదుపును కొంత కాలం పాటు క్రమం తప్పకుండా పెట్టుబడి పెడితే, అసలు మొత్తం మారవచ్చు. తరచుగా పెట్టుబడిని ప్రారంభించడంలో అతిపెద్ద అడ్డంకి డబ్బు కాదు. కానీ ప్రారంభించడానికి ఉన్న సంకోచమే. తాము గణనీయమైన మొత్తాన్ని కూడబెట్టిన తర్వాతే పెట్టుబడి పెట్టడం ప్రారంభిస్తామని ప్రజలు భావిస్తారు. కానీ రోజుకు రూ. 50 పద్ధతి ఈ ఆలోచనా విధానాన్ని మార్చగలదు. ఒక చిన్న మొత్తాన్ని పక్కన పెట్టడం పెట్టుబడి పెట్టే అలవాటును పెంపొందించడంలో సహాయపడుతుంది. అలాగే ప్రారంభ ఒత్తిడిని తగ్గిస్తుంది. ఆదాయం పెరిగే కొద్దీ ఈ మొత్తాన్ని తర్వాత పెంచుకోవచ్చు. ప్రారంభ లక్ష్యం పెద్ద రాబడులను సంపాదించడం కాకుండా, క్రమం తప్పకుండా పెట్టుబడి పెట్టే అలవాటును పెంపొందించుకోవడం కావచ్చు.

# రోగి భద్రతే వైద్య సేవల్లో తొలి ప్రాధాన్యం

కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఘనంగా ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం

నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులకు అవగాహన సదస్సు

రోగి--కుటుంబం--సమాజ భాగస్వామ్యంతో సురక్షిత వైద్య సేవలు : వైద్యుల పిలుపు









**కర్నూలు జిల్లాలోని వైద్యం, సెప్టెంబర్ 17 , (సీమకిరణం న్యూస్):** కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రపంచ రోగి భద్రతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రిలోని ధన్వంతరి హాల్‌లో నర్సింగ్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సూపరింటెండెంట్, సైకియాట్రీ ప్రొఫెసర్ డా. ఎన్. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రోగ నిర్ధారణలో భద్రత, మానసిక శ్రేయస్సు, సురక్షితమైన వైద్య ఫలితాల సాధనలో రోగి, కుటుంబం, సమాజ భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డా. ఎస్. లక్ష్మీబాయి మాట్లాడుతూ మందుల భద్రత, ప్రతికూల ఔషధ ప్రభావాల నివారణ, తృతీయ స్థాయి వైద్యంలో అంటువ్యాధుల సమగ్ర నిర్వహణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డా. శ్రీరాములు మాట్లాడుతూ.. ఇన్ఫెక్షన్ల నివారణ, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, సురక్షిత టీకాలు, ఇంజెక్షన్ పద్ధతులు, శస్త్రచికిత్స సమయంలో పాటించాల్సిన భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం రోగులకే తొలి ప్రాధాన్యం ఇస్తూ, క్లినికల్ నిర్లక్ష్యానికి తావులేని నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తమ నిబద్ధతను చాటుతూ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు 'రోగి భద్రతా ప్రతిజ్ఞ' స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ ఫ్యాకల్టీ, నర్సింగ్ సూపరింటెండెంట్లు, వివిధ క్లినికల్ విభాగాలకు చెందిన నర్సింగ్ విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ద్వారా పరిశుభ్రమైన కర్నూలుగా తీర్చిదిద్దుదాం

దీపాలు వెలిగించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి








**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 17, (సీమకిరణం న్యూస్) :** స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ద్వారా జిల్లాను పరిశుభ్రమైన కర్నూలుగా తీర్చిదిద్దుదాం అని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తన నివాసంలో దీపాలు వెలిగించి స్వచ్ఛతా హి సేవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, కార్యాలయాలు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంపొందించడంతో పాటు, స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడంతో పాటు ప్రజలను స్వచ్ఛత పట్ల చైతన్యవంతులను చేయాలని కలెక్టర్ సూచించారు. తెలిపారు. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డిఆర్వో వెంకట నారాయణమ్మ,.కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, తదితరులు దీపాలు వెలిగించారు.

# వాహనదారుల భద్రతే లక్ష్యం

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 17, (సీమకిరణం న్యూస్):** నగరంలో వాహనదారులు, పాదచారుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రధాన రహదారులు, కూడళ్లలో రోడ్ మార్కింగ్స్, సెంటర్ లైన్స్, ఎడ్జ్ లైన్స్, లేన్ లైన్స్, జీబ్రా క్రాసింగ్స్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. గురువారం గాంధీ నగర్ సమీపంలోని శోభన్ బాబు కూడలి వద్ద జరుగుతున్న రోడ్ మార్కింగ్స్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు వాహనదారులు, పాదచారులకు స్పష్టమైన మార్గదర్శకత్వం కల్పించేందుకు రోడ్ మార్కింగ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.50 లక్షలతో 14 కూడళ్లు, ప్రధాన రహదారులపై అవసరమైన రోడ్ మార్కింగ్ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం వినాయక ఘాట్ పరిశీలించారు. సెట్కూరు కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసి, నిర్వాహకులకు పరిశుభ్రత, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా సూచనలు చేశారు.

# దేశంలోనే అతి పొడవైన నాన్ స్టాప్ రైలు ఎక్కడా ఆగదు!



దేశవ్యాప్తంగా ప్రస్తుతం రైళ్లకు మహర్దశ నడుస్తోందని చెప్పొచ్చు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ రైళ్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుండటంతో ఎక్కడికక్కడ కొత్త రైల్వే లైన్ల ఏర్పాటు, కొత్త రైళ్లను పట్టాలెక్కించడం, స్టేషన్లను విమానాశ్రయాల తరహాలో తీర్చిదిద్దడంలాంటి పనులతోపాటు వందేభారత్, వందే సాధారణ్ లాంటి రైళ్లను కూడా పట్టాలపైకి ఎక్కిస్తున్నారు.ప్రయాణికులు ఆహ్లాదకరమైన అనుభూతిని ఇవ్వాలనే ఉద్దేశంతో సెమీ హైస్పీడ్ రైళ్లయిన వందే భారత్ ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇవి దేశంలోని ప్రధాన నగరాల మధ్య ఎక్కువ దూరాన్ని తక్కువ సమయంలో చేరుకునేలా ఉద్దేశంతో పట్టాలెక్కించారు.వందేభారత్ కన్నా ముందుగానే పట్టాలెక్కిన రైలువందేభారత్ రైళ్లతో సంబంధం లేకుండా వీటికంటే ముందే పట్టాలెక్కిన ఓ సూపర్ ఫాస్ట్ రైలు ఎక్కడైతే బయలుదేరిందో అక్కడి నుంచి గమ్యస్థానానికి చేరుకోవడానికి కేవలం మూడు స్టాప్స్ ఉన్నాయి. బయలుదేరిన స్టేషన్ నుంచి ఆగకుండా ఏకంగా 493 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. దేశంలో ఆగకుండా ఎక్కువ దూరం ప్రయాణించి అత్యంత పొడవైన నాన్ స్టాప్ రైలుగా ప్రసిద్ధి కెక్కింది. దానిపేరు ముంబయి సెంట్రల్ – హపా దురంతో ఎక్స్ ప్రెస్. ముంబయిలో ప్రతిరోజు రాత్రి 11.00 గంటలకు బయలుదేరే ఈ రైలు నాన్ స్టాప్ గా 493 కిలోమీటర్ల దూరం ప్రయాణించి తెల్లవారుజామున 4.50 గంటలకు అహ్మదాబాద్ చేరుకుంటుంది. అక్కడి నుంచి మరో రెండు స్టేషన్లలో మాత్రమే ఆగి హపా వెళుతుంది.ఎక్కడా ఆగకుండా 465 కిలోమీటర్ల ప్రయాణంముంబయి–హపా రైలు తర్వాత పుణె–హౌరా దురంతో ఎక్స్ ప్రెస్ కూడా ఈ జాబితాలో పేరు సంపాదించుకుంది. పుణెలో బయలుదేరి ఎక్కడా ఆగకుండా 468 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. దీంతోపాటు ముంబయి–న్యూఢిల్లీ–ముంబయి రాజధాని ఎక్స్ ప్రెస్ రైలు కూడా ఎక్కడా ఆగకుండా 465 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాతే తొలి స్టాప్ ఉంది. ఇది ముంబయిలో బయలుదేరిన తర్వాత రాజస్థాన్ లోని కోటా వద్ద ఆగుతుంది. ఆ సమయంలో 465 కిలోమీటర్లు నాన్ స్టాప్ గా ప్రయాణిస్తుంది. భారతీయ రైల్వేలో ఇటువంటి రికార్డులు చాలా ఉన్నాయి. ప్రయాణికులకు అతి తక్కువ ధరల్లో భద్రతతో కూడిన ప్రయాణాన్ని కల్పిస్తూ వారిని క్షేమంగా గమ్యస్థానానికి చేర్చడంలో భారతీయ రైల్వేలు ప్రపంచవ్యాప్తంగా గొప్ప పేరును సంపాదించుకున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద రైల్వే నెట్ వర్క్ లో నాలుగో స్థానంలో నిలిచింది.

# కేవలం 15 రోజుల్లో ఎన్ని లక్షల బీఎస్ఎన్ఎల్ సిమ్‌లు అమ్ముడయ్యాయో తెలుసా?




భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ప్రభుత్వ టెలికాం సంస్థ. ఇది చాలా సంవత్సరాలుగా సేవలు అందిస్తోంది. ఇటీవల ప్రైవేట్ టెలికాం కంపెనీలకు ఆదరణ పెరిగింది కానీ మళ్లీ కస్టమర్లలో బీఎస్ఎన్ఎల్‌ని ఉపయోగించే ధోరణి పెరిగింది. దేశంలోని అత్యంత సంపన్నుడు ముఖేష్ అంబానీకి చెందిన టెలికాం కంపెనీ రిలయన్స్ జియో ఇటీవల తన రీఛార్జ్ ప్లాన్‌లను మార్చింది. రీఛార్జ్ ప్లాన్ ధర 12.5 శాతం నుంచి 25 శాతానికి పెరిగింది. ఇది మాత్రమే కాదు, ఇతర టెలికాం కంపెనీలు ఎయిర్‌టెల్, వొడాఫోన్ కూడా ధరలను పెంచాయి. దీంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.ధరల పెంపు తర్వాత, చాలా మంది కస్టమర్లు జియోను విడిచిపెట్టాలని భావించారు. ప్రత్యామ్నాయం ఏమిటనే దానిపై కూడా చర్చలు మొదలయ్యాయి. అందులోనూ బీఎస్ఎన్ఎల్ పేరు ముందుకు వస్తోంది. చాలా మంది నంబర్‌ను పోర్ట్ చేసి బీఎస్ఎన్ఎల్‌లో చేరాలని కూడా ఆలోచిస్తున్నారు. ప్రైవేట్ టెలికాం కంపెనీల టారిఫ్ ప్లాన్‌ల పెంపు కారణంగా వినియోగదారులు బీఎస్ఎన్ఎల్‌ని ఎంచుకుంటున్నారు.ఇది కూడా చదవండి: ఆగస్టు 1 నుండి ఈ నియమాలలో మార్పులు.. నేరుగా మీ జేబుపై ప్రభావంఅయితే సర్వీస్ పరంగా ప్రైవేట్ టెలికాం కంపెనీల కంటే బీఎస్ఎన్ఎల్ చాలా వెనుకబడి ఉంది. ప్రైవేట్ కంపెనీలు 5%+% సేవలను అందిస్తున్న చోట బీఎస్ఎన్ఎల్ 4 సేవలను మాత్రమే అందిస్తోంది. కానీ ఒకప్పుడు బీఎస్ఎన్ఎల్ దేశంలోనే అగ్రగామి టెలికాం కంపెనీ. కస్టమర్ల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది.సుమారు 20–25 సంవత్సరాల క్రితం, టెలికాం మార్కెట్‌లో బీఎస్ఎన్ఎల్ వాటా 18 శాతానికి పైగా ఉంది. అయితే ఇప్పుడు పరిస్థితి మారుతోంది. ప్రైవేట్ కంపెనీల రీఛార్జ్ ప్లాన్ ధరలు పెరిగిన తర్వాత బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు పెరుగుతోంది. జూలై మొదటి 15 రోజుల్లో 15 లక్షల మందికి పైగా బీఎస్ఎన్ఎల్ కనెక్షన్లు తీసుకున్నారని నివేదికలు చెబుతున్నాయి.

# ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీపై పన్ను భారం లేకుండే చేసే ఫారంలు ఇవే వెంటనే బ్యాంకులో సమర్పించండి




ఆదాయం పెంచుకోవడానికి, భవిష్యత్తు అవసరాలకు ప్రతి ఒక్కరూ వివిధ మార్గాలలో పెట్టుబడులు పెడుతుంటారు. వాటి నుంచి రాబడి పొందుతూ ఉంటారు. అలా వచ్చిన ఆదాయం పరిమితికి మించి ఉంటే ఆదాయపు పన్ను చెల్లించాలి. ఇది దేశ పౌరులందరి బాధ్యత. అయితే ఆదాయపు పన్ను చట్టం ప్రకారం కొంత ఆదాయానికి పన్ను మినహాయింపు ఉంటుంది. దాని గురించి అవగాహన పెంచుకుంటే పన్నును పొదుపు చేసుకోవచ్చు. వాటిలో ఫారం 15జీ, 15 హెచ్ చాలా ముఖ్యమైనవి. వీటి ద్వారా మీరు ఫిక్స్‌డ్ డిపాజిట్ల పై ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్ (టీడీఎస్)ను పొదుపు చేసుకోవచ్చు.ఫారాలు ఇవే..ఫిక్స్‌డ్ డిపాజిట్లపై టీడీఎస్ పొదుపు చేయాలనుకునేవారు 15జీ, 15 హెచ్ ఫారాలను బ్యాంకులకు స్వయంగా సమర్పించాలి. ఒక ఆర్థిక సంవత్సరంలో మీ వడ్డీ ఆదాయం రూ. 40 వేలు దాటినప్పుడు బ్యాంకులు టీడీఎస్ ను తీసివేస్తాయి. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 194ఏ ప్రకారం సీనియర్ సిటిజన్లకు ఈ వడ్డీ ఆదాయ పరిమితి రూ. 50 వేలు ఉంది. అయితే వివిధ బ్యాంకుల్లోని అన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి మీకు వచ్చే వడ్డీ ఆదాయాన్ని లెక్కిస్తారు. ఆర్థిక సంవత్సరంలో మీ ఆదాయం పన్ను విధించదగిన పరిమితి కంటే తక్కువగా ఉన్నప్పుడు 15జీ, 15 హెచ్ ఫారాలను బ్యాంకులకు అందజేయాలి. దాని ద్వారా మీ వడ్డీ ఆదాయంపై టీడీఎస్ తీసివేయవద్దని అభ్యర్థించవచ్చు. నిబంధనల ప్రకారం.. 60 ఏళ్ల కంటే తక్కువ వయసున్న వారు ఫారం 15జీని, అంతకంటే ఎక్కువ వయసున్న సీనియర్ సిటిజన్లు ఫారం 15హెచ్ ను అందజేయాల్సి ఉంటుంది.ఫారమ్ 15జీని ఎవరు సమర్పించాలంటే..60 ఏళ్ల కంటే తక్కువ వయసున్న వ్యక్తులు, హెచ్ యూఎఫ్ లు, ట్రస్టులు, ఇతర మదింపుదారులు (కంపెనీలు లేదా సంస్థలను మినహాయించి). సమర్పించాలి.మీ ఆదాయంపై లెక్కించిన పన్ను శున్నా అయినప్పుడు అందజేయాలి.15 హెచ్ ఎవరు సమర్పించాలంటే..60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వ్యక్తులు లేదా సీనియర్ సిటిజన్లు అందజేయాలి.వీరి ఆదాయం కూడా పన్ను విధించే పరిమితికి కంటే తక్కువగా ఉన్నప్పుడే సమర్పించాలి.డౌన్ లోడ్ ఉచితం.. టీడీఎస్ భారాన్ని తగ్గించే రెండు ఫారాలనూ దేశంలోని అన్ని ప్రధాన బ్యాంకుల వెబ్ సైట్ నుంచి ఉచితంగా డౌన్ లోడ్ చేసుకోవచ్చు. అలాగే ఆదాయపు పన్ను శాఖ వెబ్ సైట్ లోనూ ఇవి అందుబాటులో ఉంటాయి.ఆన్ లైన్ లో అందజేసే అవకాశం..దేశంలోని వివిధ బ్యాంకులు ఆన్‌లైన్‌లో ఫారం 15జీని పూరించడానికి, సమర్పించడానికి అవకాశం కల్పించాయి. ఈ సదుపాయం కోసం యాక్టివ్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ లాగిన్ అవసరం.మీ యూజర్ ఐడీ , పాస్‌వర్డ్ ను ఉపయోగించి మీ బ్యాంక్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ పోర్టల్‌కి లాగిన్ చేయండి. మీ ఫిక్స్‌డ్ డిపాజిట్ వివరాలను వీక్షించడానికి ఆన్‌లైన్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల ట్యాబ్‌కు వెళ్లండి.అదే పేజీలో ఫారమ్ 15జీని వెతకండి. పూరించదగిన ఫారంను తెరవడానికి లింక్‌పై క్లిక్ చేయండి.మీ బ్యాంక్ బ్రాంచ్ సమాచారంతో సహా అన్ని వివరాలను జాగ్రత్తగా పూరించండి. అనంతరం సబ్మిట్ చేయాలి.ముఖ్యమైన అంశాలు..ఫారం 15జీ, 15 హెచ్ ఈ రెండూ స్వీయ డిక్లరేషన్ ఫారాలు. 60 ఏళ్ల కంటే తక్కువ వయసున్న వారు15జీ, సీనియర్ సిటిజన్లు 15 హెచ్ ఫారాలను టీడీఎస్ నివారణకు అందజేయాలి.ఆర్థిక సంవత్సరంలో రూ. 40 వేల కంటేఎక్కువ వడ్డీని పొందినట్లయితే, మీరు ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో అంటే ఏప్రిల్‌లో వీటిని అందజేయాలి.

# పెట్టుబడి దారులకు అలర్ట్ కొత్త బడ్జెట్‌తో పన్ను విధానంలో మార్పులు ఇవి తెలుసుకోకపోతే నష్టపోతారు





పార్లమెంట్ లో కేంద్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టిన తర్వాత పలు కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. మంత్రి నిర్మలా సీతారామన్ తన ఆర్థిక పద్దులో మినహాయింపులు, సబ్సిడీలు, తగ్గింపులు అమలు చేయడంతో పాటు కొన్నింటికి కొత్త పన్ను విధానాలను రూపొందించారు. ముఖ్యంగా మూలధన లాభాలపై పన్ను విధించే విధానంలో మార్పులు తీసుకువచ్చారు. ఈ కొత్త నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి. బంగారం, వెండి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్ లు), ఈక్విటీ, హైబ్రిడ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్ వోఎఫ్ లు), అంతర్జాతీయ పథకాలు వంటికి దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్ టీసీజీ) పన్ను ప్రయోజనాలకు అర్హత పొందుతాయి.ప్రధాన మార్పులు ఇవే..కొత్త బడ్జెట్ లో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయం హోల్డింగ్ పిరియడ్ తగ్గించడం. లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌గా బంగారంలో ఇన్వెస్ట్ చేయడానికి కాలవ్యవధిని 36 నెలల నుంచి 24 నెలలకు తగ్గించారు. అలాగే బంగారంపై ఎల్ టీసీజీ లెక్కింపు కోసం ఇండెక్సేషన్ ప్రయోజనాన్నితొలగించారు. మ్యూచువల్ ఫండ్ (ఎమ్ఎఫ్) ఆఫర్లు, ఈక్విటీ లేదా డెట్ ఆధారితమైనవి కాకుండా, 24 నెలలకు పైగా ఉంచనవి ఇప్పుడు 12.5 శాతం దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నుకు అర్హత పొందుతాయి. ప్రస్తుతం బంగారం, వెండి ఈటీఎఫ్ లు, ఇండెక్స్ ఫండ్‌లు, ఈక్విటీ ఓరియెంటెడ్, హైబ్రిడ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్ఓఎఫ్‌లు), అంతర్జాతీయ పథకాలపై పెట్టుబడిదారుల ఆదాయపు పన్ను స్లాబ్ రేటుపై పన్ను విధిస్తున్నారు. వివిధ రకాల ఆస్తులకు మూలధన లాభాల పన్ను విధానంలో మార్పులు తీసుకువచ్చారు. స్వల్పకాలిక మూలధన లాభాలు (ఎస్టీసీజీ), దీర్ఘకాలిక మూలధన లాభాలు (ఎల్టీసీజీ) కోసం హోల్డింగ్ పీరియడ్ లను మార్చారు. దీనివల్ల ఈక్విటీ, డెట్, బంగారం, మ్యూచువల్ ఫండ్స్, ప్రాపర్టీలో పెట్టుబడులపై ప్రభావం చూపుతుంది.కొత్త నియమాల అమలు..మ్యూచువల్ ఫండ్ లలో ఈక్విటీకి 35 నుంచి 65 శాతం కేటాయించే పెట్టుబడిదారులు, డెట్, ఈక్విటీ లేదా రెండింటి కలయికతో మూడేళ్ల కంటే ఎక్కువ కాలం పాటు వీటిని కొనసాగించేవారు ఇండెక్సేషన్ ప్రయోజనాలను పొందలేరు. అలాగే బంగారం మూలధన లాభాలపై తీసుకు వచ్చిన కొత్త నియమాలు 2024 జూలై 23 నుంచి వర్తిస్తాయి.గతంలో ఉన్న నిబంధల ప్రకారం బంగారం, బంగారు ఆభరణాల అమ్మకంపై దీర్ఘకాలిక మూలధన లాభాలను లెక్కించేటప్పుడు ఇండెక్సేషన్ (ద్రవ్యోల్బణ ధర సద్దుబాటు)ను అనుమతించేవారు.ద్రవ్యోల్బణంలో మార్పులను ట్రాక్ చేసే ఇండెక్స్ ప్రకారం సముపార్జన ధరను పెంచడం ద్వారా పన్ను విధించే మూలధన లాభాలను తగ్గించడానికి సూచిక ఉపయోగపడుతుంది.బంగారాన్ని 36 నెలల పాటు కలిగి ఉంటే దాని అమ్మకంపై మూలధన లాభాలను దీర్ఘకాలికంగా పరిగణించేవారు. 20 శాతం పన్ను విధించేవారు.దేశీయ ఈక్విటీలలోని కార్పస్‌లో 35 శాతం కంటే తక్కువ పెట్టుబడి పెట్టే ఏదైనా ఎమ్ఎఫ్ పథకానికి ఇకపై ఇండెక్సేషన్ ప్రయోజనాలు ఉండవని ప్రభుత్వం తెలిపింది. అటువంటి పథకాలపై బ్యాంకు డిపాజిట్లతో సమానంగా పన్నును తీసుకువచ్చారు.

# సోషల్ మీడియా అలవాటు తగ్గించుకునేందుకు ఎలన్ మస్క్ టిప్స్!



ఇప్పటి యూత్‌కు సోషల్ మీడియానే జీవితంగా మారిపోయింది. ముఖ్యంగా టీనేజర్లు దీనివల్ల ఎక్కువగా నష్టపోతున్నారు. రీల్స్ మోజులో పడి ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు ఇటీవల కొన్ని వెలుగులోకి వచ్చాయి .మితిమీరుతున్న సోషల్ మీడియా అడిక్షన్‌ను కంట్రోల్ చేయడం ఎలాగో ఇప్పుడు తెలుసుకుందాం.క్షణం తీరిక లేకుండా రోజంతా సోషల్ మీడియాలోనే ఉండేవాళ్లు చాలామందే ఉన్నారు. ఇలాంటి వాళ్లు మానసిక ఆరోగ్యం పాడవ్వక ముందే సోషల్ మీడియా నుంచి బయటకు రావాలి. సోషల్ మీడియా అడిక్షన్‌ను తగ్గించడం కోసం ఎలన్ మస్క్ కొన్ని సూచనలు చేశారు. అవేంటంటే..సోషల్ మీడియా వలలో ఒక్కసారి చిక్కుకుంటే ఇక బయటపడటం కష్టం. కాబట్టి పిల్లలకు చిన్న వయసు నుంచే సోషల్ మీడియా వాడే అలవాటుని తగ్గించాలి. ఈ విషయంపై పేరెంట్స్ ప్రత్యేక శ్రద్ధ వహించాలి.యూజర్లను ఎక్కువగా అట్రాక్ట్ చేసేలా సోషల్ మీడియా అల్గారిథమ్స్ ఉంటాయి. కాబట్టి పిల్లలు వాటిని వాడే విషయంలో తల్లిదండ్రులే జాగ్రత్తపడాలని మస్క్ సూచించారు.పిల్లలు సోషల్ మీడియాకు అడిక్ట్ అయితే వారి మానసిక ఆరోగ్యంతో పాటు చదువు కూడా పాడవుతుంది. కాబట్టి పిల్లలను ఓ కంట గమనిస్తూ ఉండాలి. గేమ్స్ కోసమనో లేదా ఫోన్ ఇస్తే సైలెంట్‌గా ఉంటారనో మొబైల్ ఇవ్వడం అలవాటు చేయకూడదు.పిల్లల మొబైల్ ఎక్కువగా వాడకుండా ఒక లిమిట్ పెట్టాలి. రోజంతా మొబైల్ పట్టుకుని ఉండే పిల్లల విషయంలో మరింత జాగ్రత్తపడాలి. మొబైల్స్‌లో సోషల్ మీడియా యాప్స్ లేకుండా చూడాలి.చిన్నతనం నుంచే సోషల్ మీడియాకు అలవాటు పడితే వారిలో ఆలోచనాశక్తి తగ్గిపోయే ప్రమాదముంది. కాబట్టి మొబైల్‌కు బదులుగా ఫిజికల్ యాక్టివిటీస్‌పై ఎక్కువ ఇంట్రెస్ట్ కలిగేలా పేరెంట్సే జాగ్రత్తలు తీసుకోవాలి.

# డేటా లేకుండా తక్కువ ధరలో వాయిస్ కాల్స్




2016లో జియో వచ్చినప్పటి నుండి భారతీయ టెలికాం పరిశ్రమలో పెద్ద మార్పులు సంభవించాయి. అంతకు ముంది, వినియోగదారులు డేటా కాకుండా ఎరియు కేవలం వాయిస్ కాల్స్ ప్లాన్లను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. ఇప్పుడు ఆ ఆప్షన్ లేదు. ఈ రోజు కస్టమర్ల కోసం అందుబాటులో ఉన్న ప్లాన్‌లు కస్టమర్ల కోసం డేటా, వాయిస్ మరియు %వామీ% నుండి అన్నింటినీ కలిపి అందిస్తున్నాయి.వినియోగదారులకు మరింత కష్టం కలిగించడానికి, టెల్కోలు ఇటీవల ధరలను కూడా పెంచాయి. దీని వల్ల కస్టమర్‌లు వాయిస్–ఓన్లీ వోచర్‌ను ఎక్కువగా కోరుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో, వినియోగదారులకు వారి మొబైల్ కనెక్షన్ నుండి ఎటువంటి డేటా అవసరం ఉండదు. కానీ, ప్రస్తుత పరిస్థితులలో డేటా కోసం కూడా చెల్లించక తప్పదు.ఆలోచన ప్రకారం, “డేటా మరియు వాయిస్ %ఉ వామీ% సేవలు రెండింటినీ కలిగి ఉన్న బండిల్ ప్లాన్‌ల అవసరం ఉన్నప్పటికీ, చాలా మంది వినియోగదారులు తాము ఉపయోగించని డేటా కోసం తాము చెల్లించడం గమనించవచ్చు.” అందుకే ఈ కొత్త ఆలోచనతో వచ్చిందని తెలిపింది.ట్రాయ్ యొక్క కన్సల్టేషన్ పేపర్‌లో, వాయిస్ %ఉ వామీ% సేవలు మాత్రమే అందించే ప్లాన్‌లను వినియోగదారుల కోసం తిరిగి తీసుకురావాలా వద్దా అని అర్థం చేసుకోవడానికి నివేదిక రూపొందిస్తోంది. ఈ ప్లాన్‌లు వినియోగదారులకు కావాలో లేదో తెలుసుకోవడానికి నియంత్రణ సంస్థ సర్వే చేసింది.ఈ సర్వే ఆధారంగా “వినియోగదారుల సర్వే నుండి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా, మార్కెట్‌లో అందుబాటులో ఉన్న టారిఫ్ ఆఫర్‌లు వాయిస్, డేటా, మరియు సేవలు మొదలైన వాటి మిశ్రమంతో విస్తృతంగా బండిల్ చేయబడిన టారిఫ్ ఆఫర్‌లు అని గమనించబడింది. అందరికీ అన్ని సేవలు అవసరం ఉండకపోవచ్చు మరియు వారికి అవసరం లేని సేవల కోసం వినియోగదారులు ఎక్కువ డబ్బు చెల్లిస్తున్నారనే అభిప్రాయం వినియోగదారులలో ఉంది కాబట్టి పెద్ద సంఖ్యలో వినియోగదారుల అవసరాలను తీర్చే ప్లాన్ల అవసరం ఉన్నట్లు పేర్కొన్నారు “ నుండి వచ్చిన ఈ ఆలోచన టెల్కోల నుండి వాయిస్ కాల్స్ మాత్రమే ఉండేలా ప్లాన్‌లను తీసుకురావడం లో సహాయపడవచ్చు. మరియు టెలికాం సంస్థలు ఇటీవలి టారిఫ్ పెంపుతో, చాలా మంది వినియోగదారులు అసంతృప్తిగా ఉన్నారు.ఇలాంటి సమయంలో ట్రాయ్ ఇలాంటి ప్రతిపాదన చేయడం గమనించదగిన విషయం.గిజ్‌బాట్ తెలుగు వెబ్‌సైట్ గాడ్జెట్లు సహా ఇతర టెక్ న్యూస్‌కు సంబంధించిన ఆసక్తికరమైన తాజా వార్తలను అందిస్తుంది. వివిధ సోషల్ మీడియా ద్వారా సరికొత్త వార్తలను ఎప్పటికప్పుడు యూజర్లకు చేరవేస్తుంది. తాజా వార్తల కోసం సోషల్ మీడియా ఖాతాలతో కనెక్ట్ అవ్వండి. మీకు ఏదైనా వార్త నచ్చితే లైక్ చేయండి. కామెంట్ చేయడం మర్చిపోవద్దు. అలాగే మీ తోటి స్నేహితులతో ఈ వార్తను పంచుకోగలరు.

# నిరుడు రాష్ట్రానికి 28 వేల కోట్ల పెట్టుబడులు



- 85 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- 2,677 పరిశ్రమలకు అనుమతులు మంజూరు

- బీఆర్ఎస్ పాలనలో పారిశ్రామిక పరుగులు

రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన టీజీ ఐ–పాస్ టీ–ప్రైడ్ (తెలంగాణ ప్రోగ్రామ్ ఫర్ ర్యాపిడ్ ఇంక్యుబేషన్ ఆఫ్ దళిత్ ఇంటర్‌ప్రెన్యూర్స్), టీ–ఐడియా (తెలంగాణ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ అడ్వాన్స్‌మెంట్) విధానాలతో అద్భుత ఫలితాలు వచ్చాయి. టీజీ ఐ–పాస్ వల్ల రాష్ట్రం పెట్టుబడులకు గమ్యస్థానంగా మారింది. గత ఆర్థిక సంవత్సరం (2023–24)లో రూ.28 వేల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయి. తద్వారా సుమారు 85 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. టీ–ప్రైడ్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, వికలాంగ వర్గాలకు రూ.402 కోట్ల ప్రోత్సాహకాలను అందించారు.2023–24 ఆర్థిక సర్వే వెల్లడించిన వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబించిన స్నేహపూర్వక విధానాలతో తెలంగాణకు పారిశ్రామిక రంగంలో మంచి గుర్తింపు లభించింది. గత ఏడాది కాలంలో 2,677 యూనిట్లకు అనుమతులు జారీచేయగా.. వాటిలో ఇప్పటికే 1,348 యూనిట్లు ఉత్పత్తి ప్రారంభించాయి. తద్వారా 32,502 మంది ఉపాధి పొందుతున్నారు. జనరల్ క్యాటగిరీ అభ్యర్థులకు సంబంధించిన టీ–ఐడియా స్కీమ్ ద్వారా 2,239 యూనిట్లకు రూ.345.98 కోట్లు మంజూరు చేశారు. ఈ స్కీమ్ కింద యూనిట్లు స్థాపించేవారికి పెట్టుబడి రాయితీలతోపాటు ల్యాండ్ కాస్ట్ రీయింబర్స్‌మెంట్, ఎస్‌జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, పవర్‌కాస్ట్ రీయింబర్స్‌మెంట్, పావలా వడ్డీ తదితర ప్రోత్సాహకాలను ఇస్తున్నారు. టీ–ప్రైడ్ కింద ఎస్సీలు ఏర్పాటు చేసుకున్న 2,211 యూనిట్లకు రూ.121.72 కోట్లు, ఎస్టీలకు సంబంధించిన 4,800 యూనిట్లకు రూ.280.18 కోట్లు, వికలాంగులు ఏర్పాటు చేసుకున్న 196 యూనిట్లకు రూ. 13.43 కోట్ల సబ్సిడీలు అందజేశారు.మెగా ఇండస్ట్రీల పెట్టుబడులుగత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ 3 మెగా ఇండస్ట్రీల నుంచి రూ.22,000 కోట్ల పెట్టుబడులు సాధించింది. వీటిలో జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ రూ.9,000 కోట్లతో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటుకు, గోడీ ఇండియా రూ.8,000 కోట్లతో గిగా స్కేల్ సెల్స్‌తోపాటు లిథియం, సోడియం అయాన్ బ్యాటరీల తయారీ పరిశ్రమలను ఏర్పాటు టేయనుండగా.. వెబ్ వర్క్స్ సంస్థ రూ.5,200 కోట్లతో డాటా సెంటర్లను ఏర్పా టు చేయాలని నిర్ణయించింది.ఎంఎస్ఎంఈలు 9.21 లక్షలురాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)ల ఏర్పాటుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసింది. తద్వారా ఉద్యమ్ పోర్టల్‌లో నమోదైన పరిశ్రమల వివరాల ప్రకారం.. 2020 నుంచి 2024 వరకు 9,21,883 యూనిట్లు ఏర్పాటయ్యాయి. ఇందులో తయారీ రంగానికి సంబంధించిన 1,90,669 యూనిట్లు, సేవల రంగానికి చెందిన 7,31,214 యూనిట్లు ఉన్నాయి.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com